# అసంగత రాజ్యంలో

అసంగత వర్మ అని ఓ రాజుండేవాడు. వర్ణించడానికి వీల్లేనంత దుర్మార్గుడు. ప్రపంచంలో తన నిర్ణయానికి తిరుగుండ కూడదని అతని పట్టుదల. తన నిర్ణయాన్ని అమలుపరచడానికి అతను తీసుకునే చర్యలు చాలా క్రూరంగానూ, ప్రజల్ని ఏడిపించేవిధంగానూ ఉండేవి. తన ప్రతాపానికి జడిసి, జనం ఏడ్చి చస్తున్నారంటే అతనికి అదొక రకమైన ఆనందం, తృప్తి కాబోలు. అతని చర్యలు ఎంత క్రూరంగా ఉండేవంటే,- ఉదాహరణకి - ఓ ముచ్చటైన జంటకి పెళ్లినిశ్చయం జరిగిందనుకోండి. ఆ జంటను చూసిన వాళ్లంతా "ఆహా! ఎంత చక్కని జంటని ఎంత ముచ్చటగా కలిపింది విధి" అని ఆనంద పడుతున్నారనుకోండి అసంగత వర్మ చెవిలో పడుతుంది ఈ సంగతి. ఆయనో విషపు నవ్వు నవ్వుకుంటాడు. ఆ పైన "ఈ దరిద్రగొట్టు వెధవలంతా ఇలా ఆనందంతో చిందులు తొక్కుతూ తన్మయస్థితిలో ఉంటే, మరి నా సంగతేం కావాలి?" అని కక్షగా సణుక్కుంటాడు. వెంటనే ఏదో దారుణమైన పన్నాగం పన్నుతాడు. ఇతని కుట్ర ఫలితంగా తెల్లారితే పెళ్లనగా ఇవాళ రాత్రికి రాత్రి పెళ్లికొడుకు రక్తంకక్కుకునో గుండె ఆగిపోయో చనిపోతాడు. నవ్వులు, పువ్వులతో కలకలలాడవలసిని పెళ్లిపందిరి పక్షవాతంవచ్చి పడిపోయిన మనిషిలా కుప్పకూలిపోయి కుమిలి,కుమిలి ఏడుస్తుంది. ఈ ఘోరకలి వెనకాతల అసంగతవర్మ హస్తం ఉందని అందరికీ తెలుసు. కాని తెలిసి ఏం ప్రయోజనం? ఆతగాడి అకృత్యాల్ని ఆపడం ఎవరికీ తరంకాదు. ప్రజల నిత్య జీవితంలో అనుకోని విధంగా ఊహించలేని సమయాల్లో అసంతగవర్మ ప్రవేశించి నానా అస్తవస్య పరిస్థితుల్ని సృష్టిస్తుంటాడు. అతని ఆకృత్యాలు ప్రజలకు తెలిసినా, ఈ దారుణ చర్యల్ని ఆపవయ్యా మహాప్రభో అని గట్టిగా నిలదీసి అడిగే దమ్ము ఎవడికీ లేదు. దానిక్కారణం లేకపోలేదు. ఊహించని రీతిలో విరుచుకుపడుతున్న దారుణం వెనకాతల అసంగతవర్మ హస్తం ఉందని ప్రజలకి తెలిసినప్పటికి, 'నువ్వే దోషివి' అని అతన్ని ఏ ధర్మాసనం ముందో నిలబెట్టడానికి వీల్లేకుండా బహు చాకచక్యంగా తన దమనకాండని సాగిస్తూ ఉంటాడు అసంగతవర్మ.

తను సంకల్పించే ఆ మంగళకార్యాల్ని పకడ్బందీగా అమలుపర్చడానికి అసంగతవర్మ ఓ మంచి సేవకుడ్ని ఎన్నుకున్నాడు. అతనిపేరు విశ్వాసభట్టు. ఈ విశ్వాసభట్టు చాలా గమ్మత్తయిన మనిషి. అతను నవ్వడంగాని, ఏడవడంగాని ఎవరూ చూడలేదు. తన భావాల్ని ముఖంలోగాని,

మాటల్లోగాని ఏనాడూ అతగాడు వ్యక్తం చేయ్యడు. కేవలం కొయ్యతో చేయబడ్డ మనిషిలా తన పని తను చేసుకుపోతుంటాడు. రాజు చెప్పిందెంతటి దరిద్రగొట్టు పని కానివ్వండి, దాన్ని కిమ్మనకుండా పూర్తి చేసుకురావడం తన ప్రథమకర్తవ్యంగా భావిస్తాడు. పోనీ ఇంత కష్టపడి ఇలాంటి దుర్మార్గపు పనులన్నీ చేసుకొస్తున్నాడు కదా అందుకు ప్రతిఫలంగా రాజు అసంగత వర్మ ఇతన్ని అభిమానంగా చూస్కుంటున్నాడా అంటే, అదీలేదు. "నేను పురమాయించిన ప్రతి పనిని వీడు చేసి తీరవలసిందే" అనే ధోరణి తప్ప, కృతజ్ఞత, మెచ్చుకోలూ ఇలాంటివేవి అసంగతవర్మకి కనీసం తెలిసినట్టు కూడా లేదు. పోనీ, ఈ విశ్వాసభట్టుగాడు ఏదేనా గొప్ప ప్రయోజనాన్ని ఆశించి అసంగతవర్మకి అడుగులకి మడుగులొత్తి చాకిరీ చేస్తున్నాడా అంటే, అదీ నిశ్చయంగా చెప్పలేం. అన్ని రకాలైన కొర్కెలకీ, కాంక్షలకీ అతీతుడిలా కనిపించేవాడు విశ్వాసభట్టు, పోనీ ప్రభువుని సేవించడం కేవలం ఒక నిష్కామకర్మగా భావించేవాడా అంటే అదీ చెప్పలేం. ఈ సంగతి ఎలా తెలిసిందంటే "తనలో జరుగుతున్న అంతర్మథనాన్ని దేన్నో తేల్చుకోడానికి ఈ వ్యక్తికి సేవచేస్తున్నాను" అని విశ్వాసభట్టు ఓ కాగితం మీద రాసిపెట్టుకున్నాడు. ఆ కాగితం అతగాడు చచ్చిపోయిన తరువాత ఎవరికో దొరికింది " ఏవిటి చెప్మా వీడి అంతర్మథనం"! అని చాలా మంది ఆశ్చర్యపడ్డారు. అయితే వాడి బాధేదో మాత్రం ఎవడికీ అర్థం కాలేదు. ఏతావాతా చెప్పవచ్చిందేవిటంటే, ఊహించడానికి వాల్లేని అనర్థాలు అకస్మాత్తుగా వచ్చి పడుతుండటం, దానికి అసంగత వర్మ కారకుడని సమస్త ప్రజలకు తెలియడం, తెలిసినా దుర్మార్గాల్ని ఆపడానికి శక్తి లేని నిస్సహాయులుగా అంతా ఉండిపోవడం ఇదంతా ఒక జీవణసరళిగా మారిపోయింది ఆరాజ్యంలో.

ఇలా కాలం గడుస్తుండగా తన శక్తి సామర్థ్యాలని మరో సారి ప్రజలకు తెలియచేయడానికి మంచి అవకాశం వచ్చింది అసంగత వర్మకి, అన్నెం పున్నెం ఎరుగని పసిపాపలు ఒకలోయలోకి విహారయాత్రకి వెళ్లుతున్నారు. వారు ప్రయాణం చేస్తున్న వాహనం ఎత్తయిన కొండ మీద మలుపు తిరుగుతుండగా, అమాంతం దానిని లోయలోకి తోయించేసి ఆపాలబుగ్గల పసిపాపల నవ్వులని శాశ్వతంగా మూసివేయవలసిందిగా విశ్వాస భట్టుని ఆజ్ఞాపించాడు. తనకి అప్పజెప్పబడిన పని చాలా కిరాతక కృత్యంగా తెలిసినప్పటికిన్ని దాన్ని విజయవంతంగా పూర్తిచేసుకురావాలనే దృడసంకల్పంతో రంగలో దూకాడు విశ్వాశ భట్టు. ఐతే ఎంచేతో గాని ఈసారి అనుకున్నట్టుగా పని జరగలేదు. పసిపాపల్ని మూకుమ్మడి హత్య చేయాలనేపథకం నెరవేరలేదు. కొండలమద్యనుండిఅభయశిఖరంలాచొచ్చుకొనివచ్చిన ఓ పెద్ద రావిచెట్టు, వాహనం లోయలోకి దొర్లిపోకుండా ఆపేసింది. ప్రమాదం అంటే అర్థం బొత్తిగా తెలియని పసిపాపలంతా కలకిల నవ్వుతూ వాహనం లోంచి బయిటకి వచ్చేసి ఆచెట్టుకిందే ఆడుతూ, పాడుతూ సరదాగా బోజనాలు చేసేరు. అసంగత వర్మ ఎవరో తనతల కొట్టేసినట్లుగా బాధ పడ్డాడు.మొట్ట మొదటిసారిగా జీవితంలో తను తలపెట్టిన పని జరక్కపోవడంతో ఆయన తోకతొక్కబడిన తాచులా బుస్సునలేచాడు. కాలుగాలిన పిల్లిలా అంత :పురంలో పచార్లు మొదలెట్టేడు.

ఇంతలో విశ్వాశ భట్టు వచ్చేడు. అతగాడి ముఖంలో ఆనందం గాని, ధుఃఖం గాని కనిపించలేదు. పని పాడయినందుకు పశ్చాత్తాపం లాంటిది అసలే కనపడ్డేదు కేవలం నిర్వికారంగా రాజుముందు నిలబడ్డాడు. పులుకూ, పలుకూ లేకుండా నిలబడ్డావిశ్వాసభట్టు మీద ఉప్పెనలా కోపం ముంచుకొచ్చింది అసంగత వర్మకి. నానా దుర్భాషలూ ఆడేడు ఆ కోపంలో. నేను వేసినపధకం నెరవేరడం నీకు ఇష్టం లేక కుట్ర పన్నేవన్నాడు. నాకు అవమానం జరిగి నలుగురు నవ్వుకుంటూఉంటే, చూసి సంతోషిద్దామని కాసుకూర్చున్న నక్కవినువ్వు అన్నాడు. నీలాంటి విశ్వాస ద్రోహి మోఖం చూడ్డం కంటేవెధవపని వేరొకటి ఉండదు కనుక, నాసమక్షంనుండి తక్షణం బయిటికి నడు అని మెడపట్టి గెంటినంత పని చేసాడు. అసంగత వర్మ తిట్టిన ఏతిట్టుకీ చలించలేదు విశ్వాశభట్టు కాని నువ్వు "విశ్వాసద్రోహివి" అని ఎప్పుడైతే తనను రాజు తిట్టాడో, అప్పుడు మాత్రం బాగా చలించేడు. అతనికళ్లోలో తీవ్రమైన నిస్పృహ కనిపించింది. అంతే – మారు మాటలేకుండా వెనుతిరిగి, బరువుగా నడుచుకుంటూ ఇంటికి వెళ్లిపోయేడు. ఇంటికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అలా వేసిన తలుపులు మళ్లీ తెరుచు కోలేదు.రోజులు గడుస్తున్నాయి. ఏవిటి చెప్మాలోపలికి వెళ్లి తలుపులు బిగించేడు, ఎప్పటికీ బయటకి రావడంలేదని ఇరుగు పొరుగు వాళ్లంతా అనుమానపడ్డారు. పది రోజులు దాటేక అనుమానం పెనుభూతంగా మారడంతో, రాజు గారి దగ్గరకు వెళ్లి సంగతి వివరించేరు–"పది రోజుల క్రిందట ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు–తెరవబడ్డేదు సరికదా–ఇంట్లోంచి అలికిడి కూడా ఏమీ వినపడ్డం లేదు" అని.

రాజుగారు వెంటనే భటుల్ని పంపేరు తలుపులు బద్దలుకొట్టిచూడమని. తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన భటులకి ఎదురుగా దూలానికి వేలాడుతున్న విశ్వాశభట్టు శవం కనిపించింది. ఎన్నాళ్లయి ఉరి వేసుకున్నాడో ఏవిటోగాని, శవం అప్పుడే కుళ్లు కంపు కొడుతోంది. శవం ఒంటి మీదున్న అంగీ జేబులోంచు ఓఉత్తరం కనపడుతోంది. భటులు శవాన్ని దింపి, ఉత్తరాన్ని రాజుగార్కి అందజేసారు. ప్రభువు ఉత్తరాన్ని విప్పి,మొదటి పంక్తి చదివి గతుక్కుమన్నాడు– "అసంగతవర్మా".

"ఏవిటి వీడి అవిధేయత? మహారాజా అని గాని, ప్రభూ అనిగాని రాయకుండా, అసంగతవర్మా అని ఏకవచనంలో నన్ను పిలిచి అవమానపరుస్తాడా తుచ్ఛుడు"అని రుసరుసలాడేడు. అయితే కొపం చూపించడానికి ఎదురుగా మనిషిలేడు. శిక్షించాలని ఉన్నా, శిక్షించడానికి అవకాశంలేని అసంగత పరిస్థితిలొ ఇరుక్కున్నాడు, ఇంతటి ప్రభువున్నూ. సరే వీడుయేంరాశాడొ చూద్దాం అని ముందుకు వెళ్ళాడు. " నువ్వు పురమాయించిన వ్రతిపనిని చేశాన్నేను- మంచిచెడ్డల్ని ఆలొచించకుండా,విశ్వాసం,కృతజ్ఞతలు లాంటి స్పందనల్ని నీనుండిఆశించడం తెలివి తక్కువతనం అని తెలిసికూడా- ఎంతోవిశ్వాసంతో నీకు సేవచేసాను. అయితె నేనెందుకు నిన్నిలా సేవించాను? నీనుండి ఏరకమయిన ప్రయోజనాన్నిగానీ, ఉపకారాన్ని గాని,లాభాన్ని గాని ఆశించి మాత్రంకాదు. దేనిమీదొ ఒకదాని మీద విశ్వాసం లేందే మనంగమ్యంచేరు కోలేమని

అంటుంటారు తెలిసిన వాళ్లంతా. నాగమ్యంఏమిటి ? నేను నాగమ్యం చేరుకోవడానికి దేనినివిశ్వసించాలి అని ఆలొచించి నిన్నువిశ్వసించి చూడాలని నిశ్చయాని కొచ్చాను. నాఅచంచల విశ్వాసం నాకేతెలియని నాగమ్యానికి చేరుస్తుందనే నమ్మకంతో నీకు ఓపిగ్గా సేవచేసాను. అయితె చివరికి జరిగింది ఏమిటి ? అందరిజీవితాల్లోకీ అసంగత పరిస్థితుల్ని ప్రవేశపెట్టగలిగిన అసంగతవర్మ ప్రభువులు కూడా అసంగత పరిస్దితిలో చిక్కుకోవలసివచ్చింది. ధీనిఅర్థం ఏమిటన్నమాట ! నాఅచంచలవిశ్వాసం కూడా నన్ను ఎక్కడికీ తీసుకువెళ్లకపోగా అదికూడా అసంగతం ఊబిలోకి లాక్కెళుతుందని. అంచేత నా మిగతా గమ్యాలమాట అలాఉంచి ఇక ఏమాత్రం ఆలస్యం లేకుండా నీ అసంగతచర్యలనుండి తప్పించుకోడానికి నేను ఎన్నుకున్న గమ్యం మృత్యువు. చూసావుగా, నేనిప్పుడు నీఆజ్ఞలకి అతీతుడ్ని. ఏ అసంగత చర్యలు నన్నింకా తాకలేవు". తన పిడికిట్లోంచి విశ్వాశభట్టు శాశ్వతంగా తప్పించుకు పోయినందుకు విసవిసలాడుతూ సింహాసనానికి చేరబడిపోయాడు అసంగతవర్మ.

(ఉదయం వారపత్రిక 17-8-90)